సాక్షి యాదాద్రి భువనగిరి

గురువారం । 2 । మార్చి । 2023



కఠినంగా వ్యవహరించండి

వృద్ధులు, మహిళలపై దాడులకు పాల్పడే వారిపై కఠినంగా వ్యవహరించాలని రాచకొండ సీపీ ఆదేశించారు.

- 8లో



యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి తిరు వీధుల్లో దివ్య విమాన రథోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

న్యూస్‌రీల్

అభ్యంతరాల స్వీకరణకు రేపు చివరి గడువు

భువనగిరి : ఎస్ఎన్‌సీయూలో 7 స్టాఫ్ నర్సు, 2 పిడియాట్రిక్ డాక్టర్ పోస్టులకు సంబంధించి ప్రొవిజినల్ మెరిట్ లిస్టుపై అభ్యర్థులు ఏవైనా అభ్యంతరాలు ఉంటే ఈనెల 3వ తేదీ వరకు తెలియజేయాలని డీఎంహెచ్ఓ డాక్టర్ మల్లికార్జున్‌రావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రొవిజినల్ మెరిట్ లిస్టును yadadri.telagana.gov.in వెబ్‌సైట్‌తో పాటు కార్యాలయం నోటీసు బోర్డులో ప్రదర్శించినట్లు పేర్కొన్నారు. అభ్యంతరాలను రాతపూర్వకంగా డీఎంహెచ్ఓ కార్యాలయంలో అందజేయాలని కోరారు.

నెగ్గిన అవిశ్వాసం



ఉప సర్పంచ్ శ్రీనివాస్‌పై ఆర్డీఓ సమక్షంలో అవిశ్వాస తీర్మానం

మోటకొండూర్ : మోటకొండూర్ గ్రామ పంచాయతీ ఉప సర్పంచ్ రేగు శ్రీనివాస్‌పై బుధవారం ఆర్డీఓ భూపాల్‌రెడ్డి సమక్షంలో అవిశ్వాస తీర్మాన ప్రవేశపెట్టారు. సర్పంచ్ వడ్డెబోయిన శ్రీలతతో పాటు 12మంది వార్డు సభ్యులు ఉండగా అవిశ్వాసానికి మద్దతుగా 8 మంది, వ్యతిరేకంగా ఐదుగురు సభ్యులు చేతులు ఎత్తారు. దీంతో ఉప సర్పంచ్‌పై సర్పంచ్, పలువురు వార్డు సభ్యులు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గింది. అవిశ్వాస తీర్మానాన్ని ఉన్నత అధికారులకు నివేదిస్తామని ఆర్డీఓ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ వీరస్వామి, తహసీల్దార్ జ్యోతి, ఎంపీఓ కిషన్, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ విప్ సునీత ఔదార్యం



గాయపడిన వ్యక్తిని ఎస్కార్ట్ వాహనంలో కూర్చోబెడుతున్న భద్రతా సిబ్బంది

యాదగిరిగుట్ట : రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తిని తన ఎస్కార్ట్ వాహనంలో ఆస్పత్రికి తరలించి ఔదార్యం చాటుకున్నారు ప్రభుత్వ విప్ గొంగిడి సునీత. యాదగిరిగుట్ట మండలంలోని మైలార్‌గూడేనికి చెందిన గౌడ యాదగిరి బుధవారం సాయంత్రం యాదగిరిగుట్ట పరిధిలోని ప్రెసిడెన్షియల్ సూట్ సమీపంలో మూల మలుపు వద్ద బైక్ పైనుంచి పడ్డాడు. ఈ ఘటనలో ఆయనకు గాయాలయ్యాయి. ఇదే సమయంలో అటుగా వెళ్తున్న ప్రభుత్వ విప్ గొంగిడి సునీత గమనించి తన కాన్వాయ్ ఆపారు.యాదగిరిని ఎస్కార్ట్ వాహనంలో ఎక్కించి యాదగిరిపల్లి పీహెచ్‌సీకి తరలించారు. దగ్గరుండి చికిత్స చేయించి ఇంటికి పంపించారు.

రుణాల దరఖాస్తు గడువు పొడిగింపు

భువనగిరి టౌన్ : దివ్యాంగులకు బ్యాంకుల ద్వారా రుణాలు మంజూరు చేయడానికి దరఖాస్తు గడువును ఈనెల 6వ తేదీ వరకు పొడిగించినట్లు జిల్లా సంక్షేమ అధికారి కె.కృష్ణవేణి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మార్చి 28వ తేదీ వరకు గడువు ఉండగా 6వ తేదీ వరకు పొడిగించినట్లు పేర్కొన్నారు. ఆసక్తిగల ఉన్న వారు tsobmms.cgg.gov.inలో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

డిప్యూటీ కలెక్టర్ల డైరీ ఆవిష్కరణ



డైరీని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ తదితరులు

సాక్షి,యాదాద్రి : తెలంగాణ రాష్ట్ర డిప్యూటీ కలెక్టర్ల అసోసియేషన్ డైరీని కలెక్టర్ పమేలా సత్పతి బుధవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అడిషనల్ కలెక్టర్ డి.శ్రీనివాస్‌రెడ్డి, ఆర్డీఓ ఉపేందర్‌రెడ్డి, డీఆర్‌డీఓ మందడి ఉపేందర్‌రెడ్డి, అధికారులు లక్ష్మి, మందడి ఉపేందర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, జగన్, రామారావు పాల్గొన్నారు.

41 మంది గైర్హాజరు

భువనగిరి : ఇంటర్మీడియట్ జనరల్ విభాగం ప్రాక్టికల్ పరీక్షలు బుధవారం ముగిశాయి. మొత్తం 813మంది విద్యార్థులకు గాను 772 మంది హాజరయ్యారు. 41 మంది గైర్హాజరయ్యారు. 2వ తేదీన బ్రిడ్జి కోర్సులకు సంబంధించిన పరీక్షలు ముగియనున్నాయి. ఫిబ్రవరి 15న ప్రారంభమైన ప్రాక్టికల్ పరీక్షలు మూడు విడతలుగా జరిగాయి.

బీఆర్‌ఎస్ పాలనలో అభివృద్ధి శూన్యం

- డీసీసీ అధ్యక్షుడు అనిల్‌కుమార్‌రెడ్డి

వలిగొండ : బీఆర్‌ఎస్ పాలనలో రాష్ట్రంలో జరిగిన అభివృద్ధి శూన్యం అని డీసీసీ అధ్యక్షుడు కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి విమర్శించారు. వలిగొండలోని ఆయన స్వగృహంలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి వరంగల్‌లో నిర్వహిస్తున్న పాదయాత్రలో యూత్ కాంగ్రెస్ నాయకులపై బీఆర్‌ఎస్ కార్యకర్తలు దాడికి పాల్పడడం హేయమైన చర్య అన్నారు. అంతేకాకుండా భూపాలపెల్లిలో రేవంత్‌రెడ్డిపై టమాటలు, కోడిగుడ్లు విసరడాన్ని తీవ్రంగా ఖండించారు. రేవంత్‌రెడ్డి చేపట్టిన హాథ్‌సే హాథ్ జోడో యాత్రకు లభిస్తున్న



కెర్చిపల్లిలో కార్యకర్తలతో మాట్లాడుతున్న అనిల్‌కుమార్ రెడ్డి

ఆదరణ చూసి ఓర్వలేకనే దాడులకు దిగుతున్నారని పేర్కొన్నారు. స్థానిక ఎమ్మెల్యే శంకుస్థాపనలు చేస్తూ అదే అభివృద్ధి అని చెప్పుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. రానున్న ఎన్నికల్లో తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ నూతి రమేష్, టీపీసీసీ కార్యదర్శి కాసుభా శ్రీనివాస్, మాజీ ఎంపీపీ తుమ్మల నర్సయ్య, పాశం సత్తిరెడ్డి, బొల్ల శ్రీనివాస్, కంకల కిష్టయ్య, బద్దం సంజీవరెడ్డి, గారిసె రవి, పలుసం సతీష్, సుధాకర్ పాల్గొన్నారు.

హాథ్ సే హాథ్ జోడో యాత్ర

వలిగొండ మండలంలోని వెల్వర్తి, మొగి లిపాక, కెర్చిపెల్లి గ్రామాల్లో డీసీసీ అధ్యక్షుడు కుంభం అనిల్ కుమార్‌రెడ్డి హాథ్ సే హాథ్ జోడో అభియాన్ పాదయాత్ర నిర్వహించారు. బీజేపీ మత రాజకీయాలను ప్రోత్సహిస్తుందని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన ఏ ఒక్క హామీని అమలు చేయలేదన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ నూతి రమేష్, కాసుభా శ్రీనివాస్‌రావు, తుమ్మల నర్సయ్య, పలుసం సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ఆదాయమే లక్ష్యం..!

క్రమబద్ధీకరణ జీఓ 59పై కొత్త మార్గదర్శకాలు

- 2014 తర్వాత ప్రభుత్వ స్థలాల్లో నిర్మించిన ఇళ్లన్నీ పరిగణనలోకి
- 440 దరఖాస్తులపై మరోసారి సర్వే
- ప్రభుత్వానికి భారీగా సమకూరనున్న ఆదాయం



ఆలేరులో సర్వే చేస్తున్న రెవెన్యూ అధికారులు (ఫైల్)

సాక్షి, యాదాద్రి : ప్రభుత్వ స్థలాల్లో నిర్మించిన ఇళ్ల క్రమబద్ధీకరణకు సంబంధించిన జీఓ 59పై ప్రభుత్వం కొత్త మార్గదర్శకాలు విడుదల చేసింది. ఈ మేరకు బుధవారం రెవెన్యూ శాఖ జీఓ 22ను జారీ చేసింది. దీంతో జిల్లాలో తిరస్కరణకు గురైన 440 దరఖాస్తులపై రెవెన్యూ అధికారులు మరో సారి సర్వే చేసి క్రమబద్ధీకరించనున్నారు. ప్రభుత్వ స్థలాల్లో నిర్మించుకున్న ఇళ్లను క్రమబద్ధీకరణ చేయించుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం జీఓలు 58, 59 తీసుకొచ్చింది. గత ఏడాది ఫిబ్రవరి 21నుంచి మార్చి 31వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించింది. యాదాద్రి భువనగిరి జిల్లాలో 1,099 దరఖాస్తులు రాగా అధికారులు వాటిని పరిశీలించి కేవలం 16 మందిని అర్హులుగా గుర్తించారు. మిగతా దరఖాస్తులను తిరస్కరించారు. అయితే ప్రభుత్వ నియమించిన సబ్ కమిటీ రెండు రోజుల క్రితం సమావేశమై మరిన్ని దరఖాస్తులను క్రమబద్ధీకరించాలని నిర్ణయించింది. ఇందుకోసం డిప్యూటీ కలెక్టర్ స్థాయి అధికారులతో సబ్ కమిటీని నియమించి సలహాలు సూచనలు తీసుకున్నారు.

జిల్లాలో ఇలా..

మండలం	దరఖాస్తులు	మండలం	దరఖాస్తులు
ఆలేరు	371	బీబీనగర్	119
మోటకొండూరు	73	బొమ్మలరామారం	22
రాజాపేట	06	ఆత్మకూర్(ఎం)	03
మోత్కూరు	10	అడ్డగూడూరు	01
తుర్కపల్లి	47	పోచంపల్లి	59
యాదగిరిగుట్ట	27	రామన్నపేట	15
భువనగిరి	97	వలిగొండ	26
		చౌటుప్పల్	195
		నారాయణపురం	12

కమిటీ సూచనల మేరకు జీఓ 59 విడుదల చేశారు.

దరఖాస్తు తేదీ ప్రామాణికం

ప్రభుత్వం కొత్తగా తెచ్చిన జీఓ 22 ప్రకారం గత సంవత్సరం ఫిబ్రవరి 21నుంచి మార్చి 31వ తేదీ వరకు వచ్చిన అన్ని దరఖాస్తులపై మరోసారి సర్వే చేపట్టి క్రమబద్ధీకరించాలని నిర్ణయించింది. గతంలో ఇచ్చిన జీఓ ప్రకారం 2014 డిసెంబర్ 2014కు ముందు ప్రభుత్వ భూముల్లో ఇళ్లు నిర్మించుకున్న వారికే క్రమబద్ధీకరణ చేయాలని ఉంది. అయితే ఎక్కువగా 2014 తర్వాత నిర్మించుకున్న ఇళ్లకు సంబంధించి దరఖాస్తులు వచ్చాయి. వాటిని నిబంధనలకు విరుద్ధంగా ఉన్నాయని తిరస్కరించారు. తాజాగా ఇచ్చిన జీఓ ప్రకారం ప్రభుత్వానికి పెద్ద ఎత్తున ఆదాయం సమకూరనుంది. 58 జీఓ ప్రకారం ఉచితంగా, 59 జీఓ ప్రకారం మార్కెట్ విలువను నిర్ణయించి క్రమబద్ధీకరించనున్నారు.

58,59 జీఓల ప్రకారం 16 దరఖాస్తులే అర్హత

క్రమబద్ధీకరణ కోసం జిల్లా వ్యాప్తంగా 1,083 దరఖాస్తులు వచ్చాయి. 58 జీఓ ప్రకారం(ఉచితంగా క్రమబద్ధీకరణ) 655 మంది దరఖాస్తు చేసుకోగా 643 దరఖాస్తులను అధికారులు తిరస్కరించారు. కేవలం 12 మాత్రమే నిబంధనల ప్రకారం ఉన్నట్లు తేల్చారు. ఇక జీఓ 59 ప్రకారం (మార్కెట్ విలువ ప్రకారం క్రమబద్ధీకరణ) 509 దరఖాస్తులు రాగా 4 ఓకే చేశారు. 440 తిరస్కరణకు గురయ్యాయి. వీటిలో అత్యంత ఖరీదైన స్థలాల జాబితాలో ఉన్న 65 దరఖాస్తులను హోల్డ్‌లో పెట్టారు. కాగా తిరస్కరణకు గురైన 440 దరఖాస్తులపై మరోసారి సర్వే చేసి క్రమబద్ధీకరించనున్నారు.

సర్వే ఇలా చేశారు

2014కు ముందు ప్రభుత్వ స్థలాల్లో ఇళ్లు నిర్మించుకున్న వారికి క్రమబద్ధీకరణ చేసేందుకు ప్రభుత్వం ఇచ్చిన జీఓ ప్రకారం సర్వే నిర్వహించారు. ఇంటికి సంబంధించిన డాక్యుమెంట్లు, ఇంటి పన్ను, విద్యుత్ బిల్లును పరిగణలోకి తీసుకున్నారు. రెగ్యులరైజేషన్ కింద ఇచ్చే పట్టా సర్టిఫికేట్‌లో లబ్ధిదారుడి ఫొటోతో కన్వేయెన్స్ డీడ్స్ తహసీల్దార్ సంతకం చేసి రిజిస్ట్రేషన్ చేసి ఇవ్వనున్నారు. ఎమ్మెల్యేల ద్వారా సర్టిఫికెట్లను పంపిణీ చేయడానికి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

4 రోజులుగా నీళ్లు బంద్

భువనగిరిలో 8 వార్డులకు నిలిచిన సరఫరా

- మరమ్మతులకు గురైన పైప్‌లైన్ మ్యాన్‌హోల్
- ఓవర్‌హెడ్ ట్యాంకులోకి చేరని నీరు.. ఇబ్బందుల్లో జనం



ట్యాంకర్ నీటిని పట్టుకుటున్న ప్రజలు

భువనగిరిటౌన్ : పట్టణ ప్రజలు తాగునీటికోసం నాలుగు రోజులుగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. హైదరాబాద్ చౌరస్తా వద్ద గల ఓవర్ హెడ్ ట్యాంకులోకి నీటిని సరఫరా చేసే పైపులైన్ మ్యాన్‌హోల్ చెడిపోవడంతో నీటి సరఫరా నిలిచిపోయింది. ఈ నెల 26వ తేదీన సమస్య తలెత్తినా ఇప్పటి వరకు పరిష్కారం కాలేదు. దీనికి తోడు సమ్మద్ చౌరస్తా నుంచి వసుంధర థియేటర్ వరకు కొత్త పైపులైన్ వేస్తున్నారు. ఈ క్రమంలో పాత పైపులైన్‌కు లీకేజీలు ఏర్పడుతుండడంతో సమస్య మరింత జటిలమైంది. ఈ ప్రక్రియ పూర్తికావడానికి మరో వారం రోజులు పట్టే అవకాశం ఉందని, అప్పటి వరకు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తామని అధికారులు చెబుతున్నారు.



పనిచేయని మ్యాన్‌హోల్

సమస్య ఉన్న ప్రాంతాలు

హైదరాబాద్‌లోని సైనిక్‌పుర్ నుంచి రోజూ భువనగిరికి మంచి నీటి సరఫరా జరుగుతుంది. పట్టణానికి నీరందించేందుకు అర్బన్‌కాలనీ, తాతానగర్, పాతబస్టాండ్, హైదరాబాద్ చౌరస్తా వద్ద ఓవర్‌హెడ్ ట్యాంకులు ఉన్నాయి. సైనిక్‌పుర్ నుంచి వచ్చే నీటితో ఈ ట్యాంకులను నింపి సరఫరా చేస్తారు. ప్రస్తుతం మూడు ట్యాంకులు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. మ్యాన్‌హోల్ పని చేయకపోవడంతో హైదరాబాద్ చౌరస్తా వద్ద ఉన్న ట్యాంకులోకి నీరు చేరడం లేదు. దీంతో 9,10,21,22,23,24,25,57 వార్డులకు నీటి సరఫరా జరుగుతుంది. ఆయా వార్డుల్లో సుమారు 14 వేల జనాభా ఉంది.

తీవ్ర ఇబ్బంది పడుతున్నాం



నీటి సరఫరా నిలిచిపోవడం, మరోవైపు వేసవి కాలం కావడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. వంట వండటానికి, చిన్నారులు పాఠశాలలో వెళ్లే క్రమంలో స్నానం చేయడానికి కూడా నీళ్లు లేవు. ట్యాంకర్ ద్వారా సరఫరా చేస్తున్న నీరు దేనికీ చాలడం లేదు. తక్షణమే సమస్య పరిష్కరించాలి.

–బిలాపురం రాజు, 23వ వార్డు

ప్రణాళిక లేకుండా పనులు



హైదరాబాద్ చౌరస్తా వద్ద ఉన్న ఓవర్‌హెడ్ ట్యాంక్ పైపులైన్ మ్యాన్‌హోల్ మరమ్మతులకు గురై వారం రోజులు కావస్తున్నా మరమ్మతులు చేస్తలేరు. అధికారులు ఎలాంటి ప్రణాళిక లేకుండా కొత్త పైపులైన్ వేస్తున్నారు. దీంతో పాత పైపులైన్‌కు లీకేజీలు ఏర్పడి నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడుంది.

–పడిగెల రేణుక, కౌన్సిలర్

ట్యాంకర్లతో సరఫరా చేస్తున్నాం

సమ్మద్ చౌరస్తా మసీద్ నుంచి వసుంధర థియేటర్ వరకు కొత్త పైపులైన్ వేస్తున్నారు. ఈ క్రమంలో పాత పైపులైన్‌కు లీకేజీలు ఏర్పడడంతో పాటు తెగిపోవడం జరుగుతుంది. దీంతో నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడుతుంది. హైదరాబాద్ చౌరస్తా వద్ద మ్యాన్‌హోల్‌ను మరమ్మతులు చేశాం. పైపులైన్ పూర్తయ్యే వరకు ఈ సమస్య ఉంటుంది. అప్పటి వరకు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తాం.

–మాధవాచారి, మున్సిపల్ డీఈ

పేదల నడ్డి విరుస్తున్న మోదీ సర్కార్

- వంట గ్యాస్ ధర పెంపుపై రేపు కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మల దహనం
- బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి

మోత్కూరు : కేంద్ర ప్రభుత్వం తరచుగా పెట్రో, గ్యాస్ ధరలు పెంచుతూ సామాన్య, మధ్య తరగతి ప్రజల నడ్డి విరుస్తుందని రాష్ట్ర ఆయిల్‌ఫెడ్ చైర్మన్, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి విమర్శించారు. మోత్కూరు వ్యవసాయ మార్కెట్‌లో బుధవారం విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రాల్లో ఎన్నికలు జరి గినప్పుడు నిశ్శబ్దంగా ఉండి ఆ తర్వాత డీజిల్, పెట్రోల్, గ్యాస్ ధరలు పెంచడం పరిపాటిగా మారిందన్నారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి రాకముందు రూ.400 ఉన్న సిలిండర్ ధర రూ.1160కు పెంచిన ఘనత మోదీకే దక్కుతుందన్నారు. బీజేపీ అంబాని, అదానీ ఆస్తులు పెంచిందే తప్ప.. దేశానికి చేసిందేమీ లేదన్నారు. మతతత్వ బీజేపీని ఎదుర్కోవడానికి లౌకిక శక్తులను



సమావేశంలో మాట్లాడుతున్న రామకృష్ణారెడ్డి

కలుపుకుని పోరాటం చేస్తామన్నారు. కేంద్రం అనుసరిస్తున్న ప్రజా, మహిళా వ్యతిరేక విధానాలకు, గ్యాస్ ధర పెంపునకు నిరసనగా ఈ నెల 3న జిల్లాలోని అన్ని మండల కేంద్రాలు, పట్టణాల్లో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మలను దహనం చేయనున్నట్లు వెల్లడించారు. సమావేశంలో మార్కెట్ కమిటీ చైర్మన్ కొణతం యాకూబ్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పొన్నబోయిన రమేష్, పట్టణ కార్యదర్శి గజ్జి మల్లేషం, సోంమల్లు, మేఘారెడ్డి, రాంపాక నాగయ్య, కూరెళ్ల కుమారస్వామి, మల్లం అనిత, మర్రి అనిల్, పానుగుల్ల విష్ణుమూర్తి, మెంట నగేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆయుష్మాన్ భారత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

బీబీనగర్ : కేంద్రం ప్రవేశపెట్టిన ఆయుష్మాన్ భారత్ పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పీవీ శ్యామ్‌సుందర్ రావు పేర్కొన్నారు. బీబీనగర్‌లో పీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆయుష్మాన్ భారత్ హెల్త్ కార్డు నమోదును ప్రారంభించి మాట్లాడారు. పేదలకు ఉచితంగా మెరుగైన వైద్యం అందించడానికి ప్రధాని మోదీ ఆయుష్మాన్ భారత్‌ను ప్రవేశపెట్టారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం రాష్ట్ర కోశాధికారి తరుణ్‌రెడ్డి, ఓబీసీ మోర్చ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శ్రీకాంత్, జిల్లా ఉపాధ్యక్షుడు అశోక్, సభ్యులు వెంకటేష్, పొట్ట నవీన్ పాల్గొన్నారు.



కార్డులో వివరాలు నమోదు చేయిస్తున్న పీవీ

గిరిజనుల ద్రోహి మోదీ

- గిరిజన సంక్షేమానికి కేంద్ర బడ్జెట్‌లో కోత విధించారు
- బుల్డోజర్ రాజకీయాన్ని అడ్డుకుంటాం
- మాజీ ఎంపీ బృందాకారత్



వివరాలు 10లో

చెత్త సేకరణ ఆటోలు వస్తలేవు..

- సీసీ రోడ్లు, డ్రెయినేజీలు నిర్మించాలి
- కుక్కలు, కోతులు, పందుల బెడద తీవ్రంగా ఉంది
- సాక్షి ఫోన్ ఇన్‌లో మొరపెట్టుకున్న పోచంపల్లి వాసులు
- పరిష్కారానికి కృషి చేస్తానని మున్సిపల్ కమిషనర్ హామీ



ఫోన్‌లో ప్రజా సమస్యలు వింటున్న మున్సిపల్ కమిషనర్ భాస్కర్‌రెడ్డి



భూదాన్‌పోచంపల్లి : మున్సిపాలిటీ పరిధిలో చెత్త సేకరణ సరిగా జరగడం లేదు.. చెత్త తరలించే ఆటోలు క్రమం తప్పకుండా రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. కోతులు, కుక్కలు, పందులతో వేగలేకపోతున్నాం సీసీ రోడ్లు, డ్రెయినేజీలు నిర్మించాలని భూదాన్‌పోచంపల్లి పట్టణవాసులు కోరారు. మున్సిపాలిటీలో నెలకొన్న సమస్యలపై బుధవారం సాక్షి నిర్వహించిన ఫోన్ ఇన్ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్‌కు సమస్యలు తెలియజేశారు. పరిశీలన చేసి పరిష్కారానికి కృషి చేస్తామని కమిషనర్ భాస్కర్‌రెడ్డి హామీ ఇచ్చారు.

ప్రశ్న : సీసీ రోడ్డు, డ్రెయినేజీలు లేవు. యువత రోడ్లు, వీధుల్లో బహిరంగంగా సిగరేట్లు, మద్యం సేవిస్తున్నారు.

–మంత్రి ప్రభు, గుత్తికొండ పెంటయ్య

కమిషనర్ : అన్ని వార్డుల్లో ప్రాధాన్యత క్రమంలో సీసీ రోడ్లు, డ్రెయినేజీలు నిర్మించాం. మళ్లీ వచ్చే నిధులతో సీసీ రోడ్లు వేయిస్తాం. బహిరంగ ప్రదేశాల్లో సిగరేట్లు, మద్యం సేవించే వారిపై పోలీసుల దృష్టికి తీసుకెళ్తాం.

ప్రశ్న : కోతులు, కుక్కల బెడద తీవ్రంగా ఉంది. బయట ఆరబెట్టే పట్టు నూలు, చిటికిని కోతులు పాడు చేస్తున్నాయి. కుక్కలు గుంపులుగా తిరుగుతూ మనుషులు, మేకలపై దాడి చేస్తున్నాయి.

–రుద్ర వెంకటేశం, లక్ష్మణ్‌నగర్

కమిషనర్ : కోతుల సమస్యను అటవీ అధికారులు దృష్టికి తీసుకెళ్తాం. కుక్కలను చంపడానికి అనుమతి లేదు. వాటి సంతతిని తగ్గించేందుకు శస్త్రచికిత్స చేయడం ఒక్కటే మార్గం. బడ్జెట్ దృష్ట్యా ప్రస్తుతానికి సాధ్యం కాదు. భవిష్యత్‌లో ఆలోచన చేస్తాం.

ప్రశ్న : హన్మాన్‌వాడలో విద్యుత్ స్తంభాలు పాతి వైర్లు లాగలేదు. –వనం ఉభయాకర్

కమిషనర్ : అవసరం ఉన్న చోట స్తంభాలు వేశాం. తీగ లాగడానికి ఎస్టిమేషన్ వేయిస్తున్నాం.

ప్రశ్న : చెత్త డంపింగ్‌యార్డు వల్ల దుర్వాసన వస్తుంది. పొలాల్లోకి చెత్త కాగితాలు కొట్టుకువస్తున్నాయి.

–ప్రభాకర్‌రెడ్డి, నారాయణగిరి

కమిషనర్ : డంపింగ్ యార్డు చుట్టూ మెస్ ఫెన్సింగ్ చేయిస్తాం. తడి, పొడి చెత్తను వేరు చేసి ఎరువుగా మార్చేందుకు బయోమైనింగ్ పనులు అగ్రిమెంట్ దశలో ఉంది.

ప్రశ్న : 11, 13 వార్డుల్లో పందుల బెడద ఎక్కువగా ఉంది. –వంగూరి పురుషోత్తం, భావనారుషిపేట

కమిషనర్ : పెంపకందారులకు నోటీసులు ఇస్తాం. ఊరి బయటకు తరలించేందుకు సర్వే నంబర్ 620లో ప్రభుత్వ భూమి కేటాయించాలని గతంలో రెవెన్యూ అధికారులకు లెటర్ రాశాం.

ప్రశ్న : చెత్త సేకరణ ఆటోలు సరిగా వస్తలేవు. మార్కండేయ గుడి వెనుక మైదానంలో చెత్త పారబోస్తున్నారు. –కటకం శ్రవణ్‌కుమార్, దోర్నాల శ్రీనివాస్, లక్ష్మణ్‌నగర్ కాలనీ

కమిషనర్ : ట్రాక్టర్‌తో పాటు నాలుగు ఆటోలను రోజు విడిచి రోజు తిప్పుతున్నాం. ఎక్కడైనా సమస్య ఉంటే పరిశీలిస్తాం

ప్రశ్న : దోమలు విపరీతంగా పెరిగాయి. పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలి. –ప్రకాశ్, వినోబాబావేనగర్

కమిషనర్ : వారంలోపు పట్టణమంతా ఫాగింగ్ చేయిస్తాం. డ్రెయినేజీలను శుభ్రం చేయించుటకు చర్యలు తీసుకుంటాం.

ప్రశ్నం : బస్వలింగేశ్వర కాలనీలో పిచ్చిమొక్కలు పెరగడంతో ఇళ్లలోకి పాములు వస్తున్నాయి. వీధి దీపాలు, సీసీరోడ్లు, డ్రెయినేజీలు కూడా లేవు.

–రావుల అనిల్, రేవనపల్లి

కమిషనర్ : జేసీబీని పంపించి కంపచెట్లు, పిచ్చి మొక్కలు తొలగిస్తాం. మౌలిక వసతుల కల్పనకు కృషిచేస్తాం.

ప్రశ్న : మిషన్ భగీరథ నల్లాల నుంచి నల్లటి పౌడర్ మాదిరి నీళ్లు వస్తున్నాయిరా నీటిని డ్రమ్ముల్లో పట్టిన తర్వాత అడుగున నల్లటి మురికి పేరుకుపోతుంది. అవసరాలకు వినియోగించుకోలేకపోతున్నాం.

–సీత ప్రభాకర్, లక్ష్మణ్‌నగర్

కమిషనర్ : మిషన్ భగీరథ ఏఈ, మున్సిపల్ ఏఈల దృష్టికి తీసుకెళ్తాం.

ప్రశ్నం : సాయినగర్‌లో కరెంట్ తీగలు కిందికి ఉన్నాయి. మిషన్ భగీరథ నీళ్లు అరకొరగా వస్తున్నాయి. –భైరు రామాంజనేయులు

కమిషనర్ : కరెంట్ తీగల సమస్యను విద్యుత్ అధికారుల దృష్టికి తీసుకెళ్తాం. తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నాం.

ప్రశ్న: 9, 10 వార్డుల్లో డ్రెయినేజీలను శుభ్రం చేయక దుర్వాసన వస్తుంది. కోతుల బెడద నుంచి విముక్తి కల్పించాలి. –పూర్ణిమాచారి, గాంధీనగర్

కమిషనర్ : పారిశుద్ధ్య సిబ్బందిని పంపించి శుభ్రం చేయిస్తాం. అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీల నిర్మాణం కోసం పరిశీలన చేస్తాం

ప్రశ్న : వైన్స్‌ల వద్ద రోడ్డుపై అడ్డగోలుగా వాహనాలు నిలుపుతున్నారు. పోచంపల్లి నుంచి రేవనపల్లి వరకు రోడ్డు మరమ్మతులు చేపట్టాలి.

–దొంతలమోని భగవాన్, సాయినగర్

కమిషనర్ : రోడ్డుపై పార్కింగ్ చేయకుండా పోలీసుల దృష్టికి తీసుకెళ్తాం. పోచంపల్లి – రేవనపల్లి రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి.

ప్రశ్న : 3వ వార్డులో ముక్తాపూర్‌కు పోయేదారిలో తాగునీటి పైప్‌లైన్‌లో మురుగునీరు కలుస్తుంది. చాలాచోట్ల విద్యుత్ స్తంభాలు, వీధిలైట్ల లేవు.

–గోదాసు సీతయ్య, రేవనపల్లి

కమిషనర్ : ఓపెన్ డ్రెయినేజీ వద్ద సిమెంట్ వేసి మురుగు రాకుండా చేశాం. అయినా సమస్య ఉంటే మరోసారి పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటాం. అవసరమైనచోట వీధి లైట్లు వేయిస్తాం.

క్లుప్తంగా

'పది'లో వందశాతం ఉత్తీర్ణత సాధించాలి

చివ్వెంల(సూర్యాపేట) : పదో తరగతిలో విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించాలని రాష్ట్ర గిరిజన కోఆపరేటివ్ కార్పొరేషన్ జనరల్ మేనేజర్ సీతారామ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని గిరిజన బాలికల హాస్టల్‌ను సందర్శించి మాట్లాడారు. క్రమశిక్షణతో చదవి భావిపౌరులగా ఎదగాలని సూచించారు. కార్యక్రమంలో వార్డెన్, హెచ్‌ఎం పాల్గొన్నారు.

సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలి

కోదాడఅర్బన్ : వసతి గృహాల్లో ప్రభుత్వ కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర గిరిజన కోఆపరేటివ్ కార్పొరేషన్ జనరల్ మేనేజర్ సీతారామ్ అన్నారు. బుధవారం కోదాడ పరిధిలోని బాలాజీనగర్‌లో ఉన్న గిరిజన బాలికల వసతి గృహాన్ని సందర్శించారు. కార్యక్రమంలో వసతిగృహ సంక్షేమాధికారి పద్మ, పాల్గొన్నారు.

ఒకరి దుర్మరణం

రామగిరి(నల్లగొండ) : రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం చెందగా మరో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన తిప్పర్తి మండల పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కేతేపల్లి మండలం కొర్లపహాడ్‌కు చెందిన సూరారపు కృష్ణయ్య (48) బుధవారం బొల్లేపల్లిలో బంధువు అంత్యక్రియలకు హాజరయ్యారు. అనంతరం రాత్రి మరో వ్యక్తితో కలిసి బైక్‌పై ఇంటికి తిరిగి వెళ్తున్న క్రమంలో చిన్నసూరారం సమీపంలో నిలిచి ఉన్న డీసీఎంను ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో కృష్ణయ్య అక్కడికక్కడే మృతిచెందగా మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని గాయపడిన వ్యక్తిని నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

చెరువులో పడి వ్యక్తి మృతి

రామగిరి(నల్లగొండ) : చెరువులో పడి ఓ వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన తిప్పర్తి మండలంలో బుధవారం వెలుగులోకి వచ్చింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మిర్యాలగూడకు చెందిన చిలుమలు రాజేష్(40)కు వెంకటాద్రిపాలెం పల్లె నాగయ్య కుమార్తె మౌనికతో 8 సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. భార్య పిల్లలలో కలిసి మిర్యాలగూడలో హమాలీ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. రాజేష్‌కు కొన్ని రోజులుగా మానసికంగా స్థితి సరిగా లేకపోవడంతో రెండు రోజుల క్రితం కుటుంబ సభ్యులు వెంకటాద్రిపాలెం వచ్చారు. మంగళవారం రాత్రి రాజేష్ ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లాడు. కుటుంబ సభ్యులు రోజంతా వెతికారు. సాయంత్రం పజ్జూరు చెరువులో శవమై తెలియాడుతుండగా స్థానికులు గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో విషయం వెలుగులోకి వచ్చింది.

శ్రీమహావిష్ణువుగా దర్శనమిచ్చి..



స్వామివారి సేవలో పాల్గొన్న ఈఓ గీతారెడ్డి



రథాంగ హోమం నిర్వహిస్తున్న ఆచార్యులు

- గరుడ వాహనంపై ఊరేగిన నృసింహుడు
- యాదాద్రిలో కనుల పండువగా దివ్య విమాన రథోత్సవం
- తిరుమాఢ వీధుల్లో విహరించిన కల్యాణ మూర్తులు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఆచార్యులు, పారాయణికులు, రుత్వికుల పఠనాలతో ఆలయమంతా ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. మంగళవారం రాత్రి శ్రీలక్ష్మీదేవిని శ్రీనృసింహస్వామి వారు పరియణమాడగా.. బుధవారం ఉదయం స్వామి వారు శ్రీమహా విష్ణు అలంకారములో గరుడవాహనంపై ఊరేగి.. రాత్రి దివ్య విమాన రథోత్సవంపై ఆలయ మాఢ వీధుల్లో విహరించారు.

ఉదయం నుంచే..

ఆలయంలో నిత్యారాధనలు నిర్వహించిన అనంతరం స్వామివారిని గరుడవాహనంపై శ్రీ మహా విష్ణు అలంకార సేవలో మాఢ వీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనం ఇచ్చారు. ఆలయ పడమటి రాజగోపురం ముందు గల వేంచేపు మండపంలో అధిష్టింపజేశారు. స్వామివారికి వేద పారాయణం చేసిన అనంతరం, అలంకార విశిష్టతను ప్రధానార్చకులు వివరించారు. ఆయా వేడుకల్లో ఆలయ అనువంశిక ధర్మకర్త బి.నర్సింహమూర్తి, ఈఓ గీతారెడ్డి, ప్రధానార్చకులు, అర్చకులు, పారాయణీకులు, రుత్వికులు, ఆచార్యులు, ఆలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

దివ్య విమాన రథంపై..

ఉత్సవాల్లో భాగంగా సాయంత్రం స్వామి వారి ఆలయంలో నిత్యారాధనలు జరిపించారు. అనంతరం చతుస్థానార్చనలు, మండపారాధనలు, మూలమంత్ర జపములు, ద్వార తోరణ పూజలు, దివ్య ప్రబంధ పారాయణాలు, మహామంత్ర పుష్ప పఠనాదులు, పురాణ, ఇతిహాస, విజ్ఞాపనలు నిర్వహించారు. అనంతరం రథాంగ హోమం, రథబలి, ఉత్సవ మూర్తుల అలంకార సేవ ఊరేగింపు గావించారు. రాత్రి వేళ స్వామివారిని ఆలయ మాఢ వీధుల్లో దివ్య విమాన రథోత్సవంపై ఊరేగించారు. భక్తుల జయ నారసింహ అంటూ నినాదాలు, బ్యాండ్ మేళాలు, భజంత్రీల చప్పుళ్ల నడుమ, బాణసంచాల వెలుగుల్లో వైభవోపేతంగా స్వామి వారి రథోత్సవ వేడుక సాగింది. దివ్య విమాన రథోత్సవానికి ముందు ఆలయ మాఢ వీధుల్లో స్థానిక యువకులు, వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు కేరింతలు, నృత్యాలతో సందడి చేశారు. కొండపైన రథోత్సవం సమయంలో అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఏసీపీ సైదులు ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

ఉత్సవాల్లో నేడు

బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం 10.30గంటలకు మహా పూర్ణాహుతి, చక్రతీర్థం, సాయంత్రం గంటలకు శ్రీపుష్ప యాగం, దేవతోద్వాసన, దోపోత్సవాలను జరిపిస్తారు.



స్వామివారికి హారతినిస్తున్న ప్రధానాచార్యులు



పారాయణం చేస్తున్న అర్చకులు



నృత్యం చేస్తున్న కళాకారులు

కొనసాగుతున్న ధార్మిక మహాసభలు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో ధార్మిక, సంగీత, సాహిత్య మహాసభలు కొనసాగుతున్నాయి. శ్రీవైష్ణవ సేవా సమాఖ్య ఆధ్వర్యంలో ప్రభాతభేరీ, యాదగిరిగుట్టకు చెందిన మిర్యాల లక్ష్మీబృందం, హైదరాబాద్ శబరిగిరీశ అయ్యప్ప భక్త బృందంచే భజన కార్యక్రమం చేపట్టారు. ఆస్థానం వారిచే మంగళవాయిద్యం, వైదిక ప్రార్థనలు నిర్వహించారు. భాస్కర బట్ల ఆంజనేయశర్మ శ్రీమత్ భాగవతాంతర్గతమైన గజేంద్రమోక్షం అనే అంశంపై ఉపన్యాసం గావించారు. పాల రామాంజనేయ భాగవతార్ సీతాకల్యాణం అను హరికథను గానం చేశారు. యాదాద్రి భజన సేవా సమితి ఆధ్వర్యంలో భజన నిర్వహించారు. సంగీత సిస్టర్స్‌చే, జీవిఆర్ మ్యూజిక్ ఇనిస్టిట్యూట్ వారిచే భక్తి సంగీతం, డి.వి మోహనకృష్ణచే కర్ణాటక సంగీతం నిర్వహించారు. సాయంత్రం పలువురు కళాకారులు నృత్యాలు చేసి ఆకట్టుకున్నారు. గడ్డం అంజయ్యచే చిందు యక్షగానం నిర్వహించారు. రథం ముందు శాపెల్లి వారిచే చెక్క భజన, శాలిగౌరారం వారిచే చిరుతల భజన, గడ్డం పాండు బృందంచే కోలాటం నిర్వహించారు.



సంగీత కచేరీ చేస్తున్న జీవీఆర్ మ్యూజిక్ అకాడమీ కళాకారులు

స్వామివారిని దర్శించుకున్న మంత్రి ఎర్రబెల్లి



అష్టోత్తర పూజలో పాల్గొన్న మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామిని బుధవారం సాయంత్రం పంచాయత్ రాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ ఆచార్యులు మంత్రికి సంప్రదాయంగా స్వాగతం పలికారు. అనంతరం గర్భాలయంలో స్వయంభూ, ప్రతిష్ఠా అలంకార మూర్తులను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ముఖ మండపంలోని ఉత్సవ మూర్తుల చెంత అష్టోత్తరం, సువర్ణ పుష్పార్చన వంటి పూజల్లో పాల్గొన్నారు. అనంతరం మంత్రికి ఆచార్యులు వేద ఆశీర్వచనం చేయగా, అధికారులు లడ్డూ ప్రసాదం అందజేశారు. కాగా ఉదయం ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి స్వామిని దర్శించుకొని పూజలు చేశారు.

పిల్లల దత్తతకు దరఖాస్తు చేసుకోవాలి

భువనగిరిటౌన్ : పిల్లలు లేని దంపతులు దత్తత తీసుకోవడానికి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ పమేలా సత్పతి తెలిపారు. బుధవారం తమిళనాడుకు చెందిన ముత్తుకరుప్పాన్, శీగప్తి సుబ్రమాన్యాన్ దపతులకు జిల్లా శిశు గృహకు చెందిన ఐదు సంవత్సరాల పాప ప్రతీకను దత్తత ఇచ్చినట్లు తెలిపారు. సీఏఆర్ఏ వెబ్‌సైడ్ సందర్శించి కావాల్సిన ధ్రువపత్రాలతో దరఖాస్తు చేసుకుంటే దత్తత ఇస్తామని తెలిపారు. కార్యక్రమంలో బాలల పరిరక్షణ అధికారి పులుగుజ్జ సైదులు ఉన్నారు.



బాలికను అప్పగిస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి

బహుజనులకు అధికారం దక్కాలి

- డీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు విశారదన్ మహారాజ్

భూదాన్‌పోచంపల్లి : బహుజనులకు రాజ్యాధికారం దక్కాలని దళితశక్తి ప్రోగ్రామ్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ విశారదన్ మహారాజ్ అన్నారు. విశారదన్ చేపట్టిన 10వేల కిలోమీటర్ల స్వరాజ్య పాదయాత్ర బుధవారం మండలంలోని జూలూరు, ముక్తాపూర్, రేవనపల్లి గ్రామాల మీదుగా రాత్రి పోచంపల్లికి చేరుకొంది. వీరికి ఆయా గ్రామాల్లో దళిత సంఘాల నేతలు ఘనంగా స్వాగతం పలికారు. పట్టణ కేంద్రంలోని కొండా లక్ష్మణ్‌బాపూజీ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఓట్లను అమ్ముకొని బానిసలుగా ఉందామా మన ఓట్లు మనం వేసుకొని పాలకులవుదామని ప్రశ్నించారు. అసెంబ్లీలో ఇప్పటివరకు పద్మశాలి, చాకలి, మంగళి సామాజిక వర్గాలనుంచి ఎమ్మెల్యే కాలేకపోవడం దురదుష్టకరమని అన్నారు. తెలంగాణలో రెడ్ల, వెలమదొరల రాజ్యాన్ని దింపి అణగారిన వర్గాలకు అధికారంలోకి తీసుకరావడమే ఈ పాదయాత్ర ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. ఇప్పటికైనా ఎస్సీ, ఎస్టీ, బీసీ అణగారిన వర్గాలు ఏకమై రాజ్యాధికారం సాధించుకోవాలని పిలుపునిచ్చారు. అంతకుముందు డీఎస్పీ జెండా, శిలాఫలకాన్ని ఆవిష్కరణ చేశారు. కార్యక్రమంలో పాదయాత్ర ఇంచార్జ్ లక్ష్మణ్, డీఎస్పీ జిల్లా అధ్యక్షుడు నరేందర్, బహుజన శక్తి రాష్ట్ర కన్వీనర్ నల్ల లక్ష్మణ్, ు చింతకింది రమేశ్, వెంకటేశ్, కొమ్ము లక్ష్మన్, నర్సింగ్, గాలయ్య, సంజీవ్, నర్సింహ, సాయికిరణ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ విశారదన్ మహారాజ్

నేరస్తులపై కఠినంగా వ్యవహరించాలి

- ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే పీడీ యాక్టు నమోదు చేయాలి
- పోలీస్ సిబ్బందికి రాచకొండ సీపీ డీఎస్ చౌహాన్ ఆదేశం



పోలీస్ అధికారులతో మాట్లాడుతున్న రాచకొండ సీపీ దేవేంద్రసింగ్ చౌహాన్

సాక్షి, యాదాద్రి : వృద్ధులు, మహిళలపై దాడులకు పాల్పడే వారిపై కఠినంగా వ్యవహరించాలని రాచకొండ పోలీస్ కమిషనర్ దేవేంద్రసింగ్ చౌహాన్ సిబ్బందిని ఆదేశించారు. అదే విధంగా ఎవరైనా ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే పీడీ యాక్టు నమోదు చేయాలన్నారు. భువనగిరి జోన్ పోలీస్ అధికారులతో బుధవారం నిర్వహించిన క్రైమ్ సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యంగా నేర నియంత్రణకు చర్యలు చేపట్టాలన్నారు. ఫిర్యాదు చేయడానికి పోలీస్‌స్టేషన్‌కు వచ్చే బాధితులతో స్నేహపూర్వకంగా వ్యవహరించాలన్నారు. వారి బాధలను ఓపికగా విని సత్వర న్యాయం చేయాలని సూచించారు. ప్రతి గ్రామంలో అవసరమైన మేరకు సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలని చెప్పారు. వృద్ధులు, మహిళల ఫిర్యాదులకు తక్షణమే స్పందించి న్యాయం చేకూర్చాలన్నారు. భూ కబ్జాదారులు, హైవే దిగ్బంధం చేసే వారిని ఉపేక్షించవద్దని చెప్పారు. యాదాద్రి భువనగిరి జోన్‌లోని ఆయా స్టేషన్ల అధికారుల పనితీరు గురించి తెలుసుకున్నారు.

భక్తులకు సీపీ ధన్యవాదాలు

యాదాద్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా పోలీస్ శాఖకు సహకరించిన భక్తులకు సీపీ ధన్యవాదాలు తెలిపారు. ఉత్సవాల ముగింపు సమయంలో భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చే అవకాశం ఉందని, కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో యాదాద్రి భువనగిరి డీసీపీ రాజేశ్ చంద్ర, ఏసీపీలు వెంకట్‌రెడ్డి, నర్సింహారెడ్డి, సైదులు, ఉదయ్‌రెడ్డి, భువనగిరి జోన్ సీఐ, ఎస్‌హెచ్‌ఓ, ఎస్‌ఐలు తదితరులు పాల్గొన్నారు.

నేడు భువనగిరి మున్సిపల్ మడిగెల వేలం

- 29 దుకాణాలకు 65 దరఖాస్తులు

భువనగిరి : పట్టణంలోని పాత బస్టాండ్ సమీపంలో ఖాళీగా ఉన్న మున్సిపల్ మడిగెలకు గురువారం మున్సిపల్ కార్యాలయంలో వేలం పాట నిర్వహించనున్నారు. మొత్తం 66 మడిగెలు ఉండగా ఇప్పటికే 37 మడిగెలను వ్యాపారులకు కేటాయించారు. మిగిలిన 29 మడిగెలు ఆరు నెలలుగా ఖాళీగా ఉన్నాయి. వీటిని వేలం వేసేందుకు నోటిఫికేషన్ ఇచ్చారు.

రూ.2,200తో వేలం పాట ప్రారంభం

మున్సిపల్ మడిగెల కోసం దరఖాస్తు గడువు ఈనెల 1వ తేదీతో ముగిసింది. 29 మడిగెలకు గాను 65 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరంతా నేడు నిర్వహించే వేలం పాటలో పాల్గొననున్నారు. మడిగెకు రూ.2,200తో వేలం పాట ప్రారంభం కానుంది. ఈ మడిగెలకు పలుమార్లు వేలం నిర్వహించినా వీటిలో వ్యాపారాలు జరగవన్న ఉద్దేశంతో తీసుకునేందుకు అంతగా అసక్తి చూపే వారు కాదు. ఈసారి రెండింతలు దరఖాస్తులు రావడంతో అసక్తిగా మారింది.



ఖాళీగా ఉన్న మడిగెలు

దరఖాస్తుదారులు వేలంలో పాల్గొనాలి

మున్సిపాలిటీకి చెందిన 29 మడిగెలకు గురువారం మున్సిపల్ కార్యాలయంలో వేలం పాట నిర్వహిస్తాం. దరఖాస్తు దారులు సకాలంలో హాజరుకావాలి. మడిగెల వేలం పార పాదర్శకంగా జరిగేలా చర్యలు తీసుకుంటాం.

–నాగిరెడ్డి, మున్సిపల్ కమిషనర్, భువనగిరి

టాటాఏస్ వాహనం బోల్తా... డ్రైవర్‌కు గాయాలు



అదుపు తప్పి బోల్తాకొట్టిన వాహనం

చివ్వెంల(సూర్యాపేట) : అతివేగంగా వస్తున్న వాహనం అదుపుతప్పి బోల్తాకొట్టడంతో డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన బుధవారం మండల పరిధిలోని బండమీది గ్రామ శివారులో సూర్యాపేట–ఖమ్మం రహదారిపై జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం...పత్తిలోడుతో సూర్యాపేట నుంచి ఖమ్మం వెళ్తున్న టాటాఏస్ వాహనం మార్గమధ్యలో బి.చందుపట్ల వద్ద అదుపుతప్పి రోడ్డుపై బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ శేషగిరి కాళ్లు, చేతులకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్త సూర్యాపేటకు తరలించారు. కాగా, పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీలించారు. వాహనాన్ని పక్కకు తీయించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

జెండా దిమ్మె ఏర్పాటును అడ్డుకున్న పోలీసులు

- పోచంపల్లిలో దళిత సంఘాల నాయకులు, పోలీసులకు తీవ్ర వాగ్వాదం
- ఎస్‌ఐపై చర్యలు తీసుకోవాలని నిరసన

భూదాన్‌పోచంపల్లి : జెండా దిమ్మె ఏర్పాటుపై దళిత శక్తి ప్రోగ్రాం నాయకులు, పోలీసులకు తీవ్ర స్థాయిలో వాగ్వాదం చోటు చేసుకుంది. ఈ ఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. డాక్టర్ విశారదన్ స్వరాజ్య పాదయాత్ర బుధవారం పోచంపల్లికి వస్తున్న క్రమంలో దళితశక్తిప్రోగ్రామ్ జెండావిష్కరణ చేయడానికిగాను నిర్వాహకులు మంగళవారం పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రి సమీపంలో దిమ్మె ఏర్పాటు చేస్తుండగా మున్సిపల్ అధికారులు తొలగించారు. చివరకు స్థానిక దళిత కౌన్సిలర్ పెద్దల చక్రపాణి జోక్యం చేసుకొని రాత్రి తిరిగి దిమ్మెను నిర్మిస్తున్న క్రమంలో సమాచారం అందుకొన్న ఎస్‌ఐ సైదిరెడ్డి అక్కడికి చేరుకొని అడ్డుకొన్నాడు. దాంతో ఎస్‌ఐ, కౌన్సిలర్‌కు మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. అనంతరం కౌన్సిలర్‌ను పోలీసులు జీపులో ఎక్కిస్తున్న క్రమంలో తోపులాట జరిగి అతని చొక్కా చిరిగింది. దాంతో ఆగ్రహించిన కౌన్సిలర్, అతని మద్దతుదారులు పోలీసుల తీరును నిరసిస్తూ అర్ధరాత్రి స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద బైఠాయించి నిరసన తెలిపారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో సమాచారం అందుకొన్న చౌటుప్పల్ ఏసీపీ ఉదయ్‌రెడ్డి, రూరల్‌సీఐ మహేశ్, వెంటనే సంఘటన స్థలానికి చేరుకొన్నారు. రాత్రి పూట ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేశారు.



చౌటుప్పల్ ఏసీపీ ఉదయ్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న కౌన్సిలర్ పెద్దల చక్రపాణి

ఎస్‌ఐను సస్పెండ్ చేయాలని వినతి..

పెద్దల చక్రపాణి దళిత ప్రజాప్రతినిధినైన తనపై దాడి చేసిన ఎస్‌ఐను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తూ చౌటుప్పల్ ఏసీపీ ఉదయ్‌రెడ్డికి వినతిపత్రాన్ని అందజేశారు. దుర్భాషలాడిన ఎస్‌ఐపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఏసీపీ స్పందిస్తూ ప్రభుత్వ అనుమతి లేకుండా విగ్రహాలు, దిమ్మెలు ఏర్పాటు చేయొద్దన్నారు. ఘటనపై విచారణ జరిపిస్తామని హామీ ఇవ్వడంతో వారు ఆందోళన విరమించారు.

పోలీస్ పహారాలో దుకాణాల తొలగింపు

ఆత్మకూర్–ఎస్(సూర్యాపేట): మండల పరిధిలోని నెమ్మికల్ దండ మైసమ్మ ఆలయం వద్ద రోడ్డు వెడల్పులో భాగంగా బుధవారం రోడ్డు వెంట ఉన్న షాపులు, అక్రమ కట్టడాలను పోలీస్ పహారాలో అధికారులు తొలగించారు. ఆలయం విస్తరించడం.. రోడ్డు పై ట్రాఫిక్ సమస్య పెరగడం కారణంగా ఇటీవల జిల్లా కలెక్టర్ వెంకట్రావ్ ఆలయ పరిసరాలను పరిశీలించారు. ఆర్ అండ్ బి రోడ్డుకు ఉన్న షాపులను, కట్టడాలను వెంటనే తొలగించి రోడ్డు విస్తరణ పనులను చేపట్టాలని ఆదేశించారు. బుధవారం ఆర్‌అండ్‌బి, రెవెన్యూ అధికారులు పోలీసుల బందోబస్తు నడుమ షాపులను జేసీబీలతో తొలగించారు. ఆర్ అండ్ బి రోడ్డు 100 ఫీట్ల వరకు విస్తరించి ఉందని, ఆక్రమించిన షాపులు మాత్రమే తొలగించామని ఆర్‌అండ్‌బి ఈఈ యాకూబ్ తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ హేమమాలిని, ఎంపీడీఓ మల్సూర్ నాయక్,, తుంగతుర్తి సీఐ నాగార్జున గౌడ్, ఎస్ఐ యాదవేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● 'మిషన్' నీరు వరదలా..

నేరేడుచర్ల మున్సిపాలిటీ పరిధిలోని ఎన్‌టీఆర్ నగర్ వద్ద మిషన్ భగీరథ పైపులైన్ బుధవారం పగిలిపోయింది. దీంతో నిరంతా జడ్జర్ల –కోదాడ ప్రధాన రహదారిపై వరదలా ప్రవహించడంతో రాకపోకలు నిలిచిపోయాయి. ఈ విషయాన్ని సంబంధిత అధికారులకు తెలియజేడంతో మిర్యాలగూడ మండలంలోని అవంతిపురంలోని మిషన్ భగీరథ హెడ్ రెగ్యులేటర్ వద్ద నీటిని నిలుపుదల చేశారు.


– నేరేడుచర్ల



మందుల పిచికారీలో జాగ్రత్తలు పాటించాలి

పాడి పంట

నడిగూడెం: ప్రస్తుత సీజన్‌లో వరిలో చీడపీడల సమస్య అధికంగా ఉంది. దీంతో రైతులు వివిధ రకాల పురుగులు, తెగుళ్లను నివారించేందుకు క్రిమిసంహారక మందులు చల్లుతున్నారు. పంట కాలంలో నాలుగు నుంచి ఆరుసార్లు రసాయన మందులను పిచికారీ చేస్తున్నారు. అయితే పురుగు మందులను వాడే విధానం తెలియకపోవడం, కనీస జాగ్రత్తలు పాటించకపోవడంతో పలువురు రైతులు అస్వస్థతకు గురై ప్రాణాలమీదకు తెచ్చుకుంటున్నారు. మిరప, వరి, పత్తి పంటలకు తెగుళ్ల తీవ్రతను బట్టి ప్రమాదకరమైన రసాయన మందులను వాడుతున్నారు. మందులు కలిపే సమయంలో ఎటువంటి గ్లౌజులు ఉపయోగించకుండా చేతులు, కర్రలను ఉపయోగిస్తున్నారు. కొన్ని సందర్భాల్లో 14 ఏళ్ల లోపు పిల్లలు కూడా పురుగు మందులు పిచికారీ చేస్తున్నారు. మందులు పిచికారీ చేసిన తర్వాత భోజనం చేయడం, నీళ్లు తాగడం, పొగ తాగడం సాధారణంగా మారింది. ఆ మందు డబ్బాలను ఇళ్లల్లో నిత్యకృత్యాలకు వాడుకుంటున్నారు. పురుగు మందుల పిచికారీలో రైతులు పాటించాల్సిన జాగ్రత్తలు నడిగూడెం మండల వ్యవసాయాధికారి ఎం. రాజగోపాలరావు మాటల్లోనే..



పురుగు మందు పిచికారీ చేస్తున్న రైతు

- పురుగు మందులు పిచికారీ చేసే ముందు తప్పనిసరిగా ముక్కు, కళ్లకు మందు తాకకుండా హెల్మెట్ వంటిది ధరించాలి.
- మందును ట్యాంకుల్లో కలుపుకునే సమయంలో చేతులకు తప్పనిసరిగా గ్లౌజులు ఉపయోగించాలి.
- పిచికారీ సమయంలో నీళ్లు తాగడం, సిగరెట్ వంటివి తాగడం చేయరాదు.
- పిచికారీ పూర్తయ్యి స్నానం చేసిన తర్వాతే ఆహారం తీసుకోవాలి.
- పురుగు మందులను గాలి వీచే వ్యతిరేక దిశలో పిచికారీ చేయరాదు.
- సాధ్యమైనంత వరకు గాలి, ఎండ ఉన్న సమయంలోనే మందులు పిచికారీ చేయడం మంచిది.
- కొన్ని రకాల రసాయన మందులు రెండు మూడు కలిపి పిచికారీ చేస్తుంటారు. ఇది చాలా ప్రమాదకరం.
- రైతులు ఎప్పటికప్పుడు వ్యవసాయాధికారుల సలహాలు, సూచనలు తీసుకోవాలి.
- రైతులు పూర్తిస్థాయి దుస్తులు ధరించి పురుగు మందులు పిచికారీ చేయడం ఉత్తమం.